ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 07 ఆగస్టు , 2026 | పేజీలు :6





బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిపిఐ ప్రచార జీపు యాత్ర ప్రారంభం

# ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

### ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి

### కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా జిల్లాలోని రైతులు కూరగాయలు, పండ్ల తోటలు పెంచే విధంగా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం అయన వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఆగస్టు తో పాటు,సెప్టెంబర్ మొదటివారంలో సరైన వర్షాలు వచ్చే అవకాశం లేదని,అంతేకాక శ్రీశైలం పూర్తిస్థాయిలో నిండనందున కిందికి నీరు వదిలే అవకాశం లేనందున రైతులు పొలాలను ఖాళీగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా ప్రతి ఎంఈఓ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రైతుల దగ్గరకు వెళ్లి కూరగాయలు లేదా పండ్ల తోటలు ,ఆయిల్ ఫామ్ వంటి తోటలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని,ముఖ్యంగా జిల్లాలో 4వేల ఎకరాల వరకు ఆయిల్ ఫామ్ తోటలు పెంచేందుకు అవకాశం ఉందని, వీలైనంత ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ సాగు చేసేలా ప్రతి రైతును ప్రోత్సహించాలని తెలిపారు. పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగు విషయంలో ఏ రైతును బలవంత పెట్టొద్దని,వారికి అవగాహన మాత్రం కల్పించాలని, రైతులు వారి సమ్మతితో ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా ప్రోత్సహించాలని చెప్పారు.జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్,ఉద్యాన శాఖ అధికారి టి .శేఖర్, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు ఈ సమావేశంలో ఉన్నారు.

**తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్**

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తన జీవితాన్ని ధార పోసిన మహనీయుడు ప్రొఫసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92 వ జయంతిని పురస్కరించుకొని, గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రొఫసర్ జయశంకర్ చిత్రపటానికి ఆయన పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి,డిఆర్ఓ దశరథ్,సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాలు సమర్పించి ఘన నివాళులర్పించారు.



## నీట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విజయం స్ఫూర్తిదాయకం

### జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారిణి సులోచనరాణి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నీట్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థి విజయం స్ఫూర్తిదాయకమని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారిణి సులోచన రాణి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్‌బ్యాగ్‌లు, షూలు పంపిణీ జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఓ విద్యార్థిని నీట్ పరీక్షల్లో మంచి ర్యాంక్ సాధించడం జిల్లాకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రభుత్వ కళాశాల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ బోధన, ప్రత్యేక కోచింగ్ ఇంకా ఎన్నో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదుగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ళ యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు గతంలో ఎన్నడూ లేనివిధంగా మెరుగుపడ్డాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణగా చదువుతూ అధ్యాపకుల మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీలు సహకరించాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించడంలో రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ భవనంలోని విసి హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఓటర్ నమోదు, సవరణ ప్రక్రియ వేగవంతంగా సాగుతుందన్నారు. షెడ్యూల్ ప్రకారం జులై 24తో ముగియాల్సిన బిఎల్‌ఓ ఇంటింటి సర్వే గడువు క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఆగష్టు 10వ తేదీ వరకు పొడగించినట్లు తెలిపారు. జిల్లాలోని 4 అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎన్యుమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తి అయిందని, సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, సి సెక్షన్ సూపరింటిండెంట్ రాజేందర్ రెడ్డితోపాటు ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## దొంగతనాలకు... ఆలయాలే టార్గెట్...

**ప్రజాపక్షం/హాలియా:** దొంగతనాలను చడీ చప్పుడు కాకుండా దోచుకునేందుకు వెసులుబాటు కలుగుతుందేమో... దొంగలు ఆలయాలను టార్గెట్గా చేసుకొని దొంగతనానికి పాల్పడుతున్నారు. ఈమధ్య అనుముల మండలంలో జరిగిన రెండు దొంగతనాలు ఆలయాలలోనే జరగడం గమనార్హం. దొంగతనం చేస్తే ఎంతో కొంత దొరుకుతుందనే ఉద్దేశంతో దొంగలు ఆలయాలను టార్గెట్గా చేసుకొని వాటిల్లో దోపిడీలకు పాల్పడుతున్నారు. అనుముల మండలంలో జూన్ నెల 29వ తేదీన హజారీగూడెం గ్రామంలో గల శివాలయంలో దొంగలు చొరబడి ఆలయంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లి దోపిడీకి పాల్పడ్డారు. ఈ సంఘటనలు సుమారు 70 వేల రూపాయల విలువగల బంగారం, వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ సంఘటన తీవ్రంగా పర్యటించిన పోలీసులు ఒకరోజు వ్యవధిలోని దొంగను పట్టుకున్నారు. ఈ సంఘటన జరిగి నెల రోజులు అయిందో లేదో తిరిగి హాలియాలోని శ్రీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో మూడో తేదీ రాత్రి గుర్తుతెలియని దొంగలు దోపిడీకి పాల్పడి అందులో ఉన్న నగదు సుమారు 5వేల రూపాయలు తీసుకొని ఉండిని పక్కనే పడేశారు. అయితే ఈ దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే గత కొన్నాళ్లుగా పోలీసులు గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు వాటి ప్రాధాన్యతపై తదితర అంశాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసుల ప్రచారంతో కొంతమంది ప్రజాప్రతి



నిధులు ముందుకు వచ్చి వారి వారి గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే గ్రామాలలో ఉన్న ప్రధాన దేవాలయాలలో కూడా ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నట్లయితే దొంగతనాలను కొంతమేర అరికట్ట వచ్చనే అభిప్రాయం అందరిలో వ్యక్తం అవుతుంది. దేవాలయాలలో సరైన రక్షణ ఉండదనే అభిప్రాయం దొంగతనానికి పాల్పడే వారిలో ఏర్పడడం వీటికి కారణమని తెలుస్తోంది. అందువల్ల ప్రజా ప్రతినిధులు గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటులో అందరి బాధ్యత ఉన్నట్లయితే మరిన్ని అక్రమ వ్యాపారాలు జరగకుండా అరికట్టే అవకాశం ఎంతైనా ఉంది. ఈ మేరకు సామాజిక కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, పోలీసులు మరింత చొరవ తీసుకొని గ్రామాలలో సిసి కెమెరాల ఏర్పాటుకు నడుం బిగించాల్సిన అవసరం ఉంది.

## డ్రైవర్లు విధిగా ఆరోగ్య భీమా

### ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** వాహన డ్రైవర్లు విధిగా ఆరోగ్య భీమాను చేసుకోవాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఆర్ డిఆర్ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరుపై టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. డ్రైవర్లు ప్రయాణాల్లో తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. క్రమశిక్షణను పాటించాలన్నారు. తమ కుటుంబ సభ్యులకు ఆర్థికబరోసా తప్పనిసరిగా కల్పించేలా భీమా చేసుకోవాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కాసాని పాపయ్య గౌడ్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కాంగ్రెస్ నాయకులు ఫారూఖ్, చెంచల అఖిల్ నాయుడు, కందుల ఉపేందర్, రత్నావత్ నాగరాజు, నాగులు నాయక్ పాల్గొన్నారు.





## మొక్కల పెంపకం బాధ్యతగా స్వీకరించాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి** : ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని బాధ్యతగా స్వీకరించి సంరక్షించాలని తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఓ ఝాన్సీ అన్నారు. గురువారం మండలంలోని రామన్నగూడెం గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మొక్కలు నాటారు. ఎక్కడా లేని విధంగా గ్రామ సర్పంచ్ నర్సరీలో 6 రకాల పండ్ల మొక్కలను పెంచడం అభినందనీయమన్నారు. నర్సరీలో పండ్ల మొక్కలు పెంచి నాటడానికి సిద్ధం చేసిన వన సేవకురాలు సుజాతను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సుధాకర్, ఉప సర్పంచ్ లింగంపల్లి రవీందర్, అంగన్వాడీ టీచర్ పుష్పలత, ఎఎన్ఎం గిరిజ, వార్డు సభ్యులు మాగి మీనాక్షి, తవిటి సైదులు, నాయకులు పాల్గొన్నారు.

## గాజులమల్కాపురంలో దొంగతనం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : వ్యవసాయ పనులకు వెళ్లిన సమయాన్ని ఆసరాగా చేసుకొని గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి నగదు దోచుకెళ్లిన సంఘటన గాజులమల్కాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాజులమల్కాపురం గ్రామానికి చెందిన బండి శంకర్ రెడ్డి ఉదయం తన వ్యవసాయ భూమి వద్దకు పనుల నిమిత్తం వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో భోజనం చేయడానికి తిరిగి ఇంటికి వచ్చారు. ఆ సమయానికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా, బీరువా తెరిచి ఉంది. అందులో దాచి ఉంచిన రూ.52వేల నగదును దొంగలు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. బాధితుడు శంకర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ టి. రాములు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు జరుపుతున్నారు.

## తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/నడిగూడెం:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని వేణుగోపాలపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం తల్లులు, గర్భిణీలకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేల్పుల సోమయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సరిత హాజరై మాట్లాడుతూ శిశువు జన్మించిన వెంటనే తల్లి పాలు పట్టించడం అత్యంత అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపి, ఉప సర్పంచ్ సంపతి వీరబాబు, ఎఎన్ఎం శైలజ, అంగన్‌వాడీ టీచర్లు తాటికొండ చిట్టెమ్మ, లక్ష్మి , ఆయాలు పద్మ పాల్గొన్నారు.

## జైల్‌భరో జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి** : ఆగష్టు 10న నిర్వహించనున్న దేశవ్యాప్త జైల్‌బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని మల్లు స్వరాజ్యం స్మారక భవన్‌లో జరిగిన రైతు సిఐటియు, వ్యవసాయ కార్మిక ప్రజాసంఘాల నాయకుల సంయుక్త సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. నాయకులు వజ్జె శ్రీను, సంపతి వెంకన్న, కడెం కుమార్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా పోలీస్ సేవలు అందించాలి



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : ప్రజలకు పారదర్శకంగా పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పి కె. నరసింహ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదులు, కేసుల వివరాలను ఎస్ఐ బాలు నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది క్రమశిక్షణ, బాధ్యతతో ఉండి నేరాలను అరికట్టి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. గ్రామ పోలీస్ అధికారి బాధ్యత పని చేసి ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్య ఉన్నా, అసాంఘీక చర్యలు, అక్రమ రవాణాలు జరిగితే వెంటనే సమాచారం సేకరించి విధంగా వనరులను బలోపేతం చేసుకోవాలని చెప్పారు. అనంతరం స్టేషన్‌కు వచ్చిన బాధితులతో ఆయన స్వయంగా మాట్లాడి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.

## నిద్రపోతున్న నిఘానేత్రం



**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని వాయిలసింగారం గ్రామంలో దాతల సహకారంతో రెండు లక్షల 50వేల రూపాయలతో సిసి కెమోరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కాని సిసికెమోరాలు ఏర్పాటు చేసిన తర్వాత మూన్నాళ్ల ముచ్చటగానే ప్రస్తుత గ్రామ పంచాయతీ దగ్గర ఉన్నటువంటి సిసి కెమోరాలు దానికి సంబంధించిన బాక్సులు, విద్యుత్ స్తంబాలపై వెలవెలబోతున్నాయి. సిసి కెమోరాల పర్యవేక్షణ లోపం వల్ల గ్రామంలో చౌరస్తాల దగ్గర ఏర్పాటు చేసినటువంటి సిసి కెమోరాలు బాక్సులు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. సిసి టివి కెమోరాలు లేకపోవడం వల్ల గ్రామంలో లోగడ గ్రామంలో కొన్ని అవాంచనీయ సంఘటన జరిగింది. గ్రామ పంచాయతీల వద్ద ఉన్నటువంటి మహాత్మా గాంధీ విగ్రహం, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహంలు కొన్ని పార్టీ దిమ్మెలు, జెండాలను కూడా ధ్వంసం చేశారు. గుర్తు తెలియని దొంగలు రామాలయంలో హుండి పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లిన సంఘటన జరిగింది. రాత్రి వేళ్లలో ఊర చెరువు, వాటర్ ట్యాంక్ వద్ద ఉన్నటువంటి ట్రాన్స్‌ఫార్మర్ పగులకొట్టి కాపర్ వైరు ఎత్తుకెళ్లారు. వ్యవసాయ పనులు జరుగుతున్న వేళ కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు కరెంట్ మోటార్లు, స్టార్టర్ పెట్టెలు ఎత్తుకెళ్లిన సంఘటనలు జరిగాయి. గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే సిసి కెమోరాలను పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## డంపింగ్ యార్డును తరలించాలి



**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామానికి అరకిలో మీటర్ దూరంలో ఏర్పాటు చేసినటువంటి డంపింగ్ యార్డు వల్ల వెంకట్రాంపురం గ్రామ ప్రజలు, అలాగే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. కోదాడ నుండి ఐదు కిలోమీటర్ల దూరం కోదాడ మున్సిపాలిటిఇ నుండి సాధారణ చెత్త, ఆసుపత్రి సంబంధించిన వ్యర్ధాలు నిత్యం వందలాటి ట్రక్కులతో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇక్కడ చనిపోయిన పశువుల కళేబారాలు, వ్యర్ధాలను తగలబెట్టడం వల్ల విఫరీతమైన పొగ, దుర్గందం వెలువడుతున్నది. కేవలం అర కిలోమీటర్ దూరంలో ఉన్న వెంకట్రాంపురం గ్రామంలో చిన్న పిల్లలకు అలాగే గ్రామ ప్రజలకు విష జ్వరాలు, శ్వాసకోశ సంబంధించిన వ్యాధులు వచ్చి ఆసుపత్రులకు వెళ్లాల్సిన సందర్భాలు కోకోల్లలు. డంపింగ్ యార్డు నుండి వచ్చే విఫరీతమైన పొగవల్ల కోదాడ నుంచి వాయిలసింగారం మీట్యాతండా తెల్లబండతండా పాతబండతండా, కొత్త తండా రత్నవరం, త్రిపురవరం ఈ రోడ్డు మార్గాన విఫరీతమైన పొగ వల్ల వాహనదారులు ఎదురెదురుగా రోడ్డు మార్గం కనపడక చాల ప్రమాదాలు జరిగినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డంపింగ్ యార్డును ఇక్కడ నుండి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

## గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల అభివృద్ధికి రూ. 88.35లక్షలతో శంకుస్థాపన

**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో గిరిజన సంక్షేమ నిధుల నుండి రూ. 88.35లక్షల వ్యయంతో చేపట్టనున్న కాంపౌండ్ వాల్, ప్రత్యేక మరమ్మతులు, టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులకు గురువారం అధికారులతో కలిసి ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ గిరిజన విద్యార్థినులు మెరుగైన విద్యతో పాటు అన్ని వసతులతో చదువుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నేరేడుగొమ్ము గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలకు సంబంధిత శాఖ ద్వారా మరిన్నినిధులు మంజూరి చేయించి పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది, జిల్లా ఉపాధ్యాక్షులు వెంకటయ్యగౌడ్, సర్పంచ్ సుధాకర్, మాజీ జెడ్పిటిసి బాలు, కొండల్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, యాదయ్య, వెంకటయ్య, సోమాని, ఆయా గ్రామాల సర్పంచ్‌లు సురేందర్‌రెడ్డి, హేమ్లా, ఉప సర్పంచ్ శ్రీను, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



**రూ. 2కోట్లతో బీటిరోడ్డు బ్యాలెన్సింగ్ పనులకు శంకుస్థాపన.**

నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పాధాన్యత ఇస్తోందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం రూ. 2కోట్ల గిరిజన సంక్షేమ శాఖ నిధులతో నేరేడుగొమ్ము కలకొండ తండా బీటి రోడ్డు (బ్యాలెన్సింగ్ పనులు) నిర్మాణానికి ఎంఎల్‌ఏ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు.



## సిపిఐ పాదయాత్రలు ప్రారంభం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్ర కార్యక్రమాన్ని గురువారం సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా అధికారంలో ఉండి ఆడిందే ఆటగా పాడిందే పాటగా బిజేపి వ్యవహరించిందన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో అడ్డదారిలో దొడ్డిదారిలో ఇతర పార్టీలు చీల్చి డిలిమిటేషన్ బిల్లు పెట్టేందుకు ప్రయత్నంచేసి చివరకు నోరు మూసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని , నల్లదనాన్ని వెనక్కి తెచ్చి ప్రతి అకౌంట్‌లో 15 లక్షల రూపాయలు వేస్తామని, 50 రూపాయలకే పెట్రోల్, డిజీల్ అందుబాటులో ఉంచుతామని అధికారంలోకి వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కత్తి శ్రీనివాసరెడ్డి, రావుల సత్యం, ఎ.లక్ష్మి , ముత్యాల భాస్కర్, ఉదర వెంకన్న, కట్టికోల వెంకన్న, కొమ్రరాజు వెంకట్, బత్తిని శ్రీనివాసగౌడ్, పరికె భరత్, దొమకొండ మనోజ్, పొలగాని రవి, బాలసైదా, ఎస్‌కె హుస్సేన్ పాల్గొన్నారు.

## అరోగ్యాన్ని హరిస్తున్న మిల్లులపై తక్షణ చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో ఉండే సునందరైస్ ఇండ్రస్టి అతిభారీ మిల్లు నుంచి వస్తున్న పొల్యుషన్, సౌండ్, డస్ట్, పురుగుల వాసన ద్వారా ప్రజలకు హని జరుగుతుందని, ప్రజల ఆరోగ్యానికి హని కలిగిస్తున్న మిల్లుపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, జై భీమ్ కమిటి అధ్యక్షులు కొత్తపల్లి రవి గురువారం డిమాండ్ చేశారు. జిల్లా పోల్యుషన్ కంట్రోల్ బోర్డు వారికి ఫిర్యాదు చేసినప్పటికీ ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. అనంతరం రైస్‌మిల్లు నుంచి వస్తున్న కాలుష్యాన్ని నియంత్రించాలని కోరుతూ ఎంపిడివో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కుర్రి వెంకన్న, పిట్ట వెంకటేష్, నకిరేకంటి రవి, అలంపల్లి శేఖర్, కొత్తపల్లి పవన్, బచ్చలకూర నాగార్జున, పిట్ట నాగరాజు, మచ్చ ఆదాం పాల్గొన్నారు.

## అక్రమ నాటుసారాయి స్థావరంపై దాడి

### ఒకరి అరెస్టు... బైక్ సీజ్





**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండలంలోని ఎర్రగట్టు తండా శివారులో అక్రమంగా సాగుతున్న నాటుసారాయి స్థావరంపై ఎక్సైజ్ అధికారులు మెరుపుదాడి నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం జరిపిన ఈ దాడిలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి పెద్ద ఎత్తున నాటుసారాయి, రవాణకు ఉపయోగిస్తున్న బైక్‌ను స్వాదీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్ఐ వెన్నెల తెలిపిన వివరాల ప్రకారం ఎర్రగట్టు తండా శివారు ప్రాంతంలో భూక్య వెంకటేశ్వర్లు రహస్యంగా నాటుసారాయి తయారు చేస్తున్నట్లు అధికారులకు విశ్వసనీయ సమాచారం మేరకు దాడిచేసినట్లు తెలిపారు. నిందితుడు డిస్టిలేషన్ సెటప్ అమర్చి నాటుసారాయి కాస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం, నాటుసారాయి తయారిపై ఉక్కుపాదం మోపుతామని, ఇలాంటి చర్యలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు విద్యాసాగర్, గోపిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## డ్రగ్స్, గంజాయి నిర్మూలనే లక్ష్యం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మండల పరిధిలో డ్రగ్స్, గంజాయి మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పోలీస్ సిబ్బంది, నార్కోటిక్ డాగ్ సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. గురువారం హుజూర్‌నగర్ పోలీస్ నేతృత్వంలో జిల్లా డాగ్ స్క్వాడ్ పోలీస్ సిబ్బంది నార్కొటిక్ డాగ్ రోలెక్స్ సహాయంతో మండలంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. రహదారి వెంట ఉన్న దాబాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, కిరాణాషాపులు, మెడికల్ షాపులతో పాటు పలు పాఠశాలల ప్రాంగణాలను, బస్టాండ్‌లు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినులు బాగా చదువుకోవాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో జిలా సాధికారత కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా మిషన్ కోఆర్డినేటర్ చైతన్య విద్యార్థినిలనుద్దేశించి మాట్లాడుతూ అమ్మాయిలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, పుస్తకాలకు దగ్గరగా ఉండాలని, ఆడపిల్లలకు ఆర్థిక, స్వాతంత్ర్యం వచ్చే వరకు చదువుకోవాలని అన్నారు. రేవతి మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక సమాజిక ఉండాలనే అప్పుడే జీవితంలో ప్రయోజకులవుతారని అన్నారు. ప్రహరి కమిటి వైస్ చైర్మన్ కందుల శివకృష్ణ, సతీష్‌కుమార్, వీరభద్రం, విష్ణువర్ధన్, దామ్లా, చిన్న బాలయ్య, వెంకటేశ్వర్లు, శాంతిప్రియ, మల్లిఖార్జున్ రెడ్డి, షాహిద్, అక్బర్ పాల్గొన్నారు.

## సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

**వాహనం, 10 లీటర్ల సారా స్వాధీనం**

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నియోజకవర్గ పరిధిలో గల పాలకవీడు మండలం జాన్‌పహడ్ గ్రామ శివారులో మహంకాళిగూడెంకు చెందిన బనావత్ లక్ష్మయ్య తన హోండా ఆక్టివా వాహనంపై 10 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేసినట్లు హుజూర్‌నగర్ ఎక్సైజ్ ఎస్ఐ దివ్య తెలిపారు. అలాగే వాహనాన్ని సీజ్ చేసి, పది లీటర్ల సారాను స్వాదీనం చేసుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సిద్ది నాగరాజు, రమణ, నరేష్ పాల్గొన్నారు.



## మండల అభివృద్ధే లక్ష్యంగా శాఖల వారీగా సమీక్ష



**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన మండల స్థాయి జనరల్ బాడీ సమీక్షా సమావేశంలో దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్ని శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. సమావేశానికి ముందు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఎల్‌ఏ, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన నేరేడుగొమ్ము మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అందులో భాగంగా నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ. 15కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల సముదాయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సముదాయంలో రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయ, పంచాయతీరాజ్, మహిళా శిశ సంక్షేమం, విద్య, వైద్యం, పశుసంవర్ధకశాఖ, హౌసింగ్, గ్రామీణాభివృద్ధి తదితర అన్ని శాఖలు ఒకే చోట ఏర్పాటు చేయబడుతుందన్నారు.

## సర్పంచ్‌లు కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలి



**ప్రజాపక్షం/వేములపల్లి:** గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు.మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మండల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. 15,16 ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో సర్పంచులు కార్యదర్శులు ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని అన్నారు. వర్షాకాలంలో దోమల నివారణ కోసం ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేయాలన్నారు. డెంగ్యూ మలేరియా వంటి సీజనల్ వ్యాధులను అరికట్టడం కోసం, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి జితేందర్, తాహసిల్దార్ పుష్పలత,వ్యవసాయ మండల అధికారి కిషోర్ నాయక్ ఏపిఎం జానకి రెవెన్యూ అధికారులు మహేందర్ రెడ్డి స్పందన,సర్పంచులు పుట్టల సందీప్ కుమార్,చల్ల శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

## హామీలను వెంటనే నెరవేర్చాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర గురువారం నకిరేకల్ కు చేరుకుంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు లక్షల కుటుంబాల ఉపాధికి ఆధారమైన గీత వృత్తిని కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాచకొండ వెంకట్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి చౌగోని సీతారాములు,సూర్యపేట అధ్యక్ష కార్యదర్శులు ఏలూరు గోవిందు, మడ్డి అంజిబాబు, మండల అధ్యక్ష కార్యదర్శులు పొడిచేటి వీరయ్య పాల్గొన్నారు.

**బస్సుయాత్రకు చిరుమర్తి సంఘీభావం**

నకిరేకల్ కు చేరుకున్న గీతన్నల చైతన్య బస్సు యాత్రకు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సంఘీభావం తెలిపారు.

## లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థుల క్రీడా విజయం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** క్రీడల్లో పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ ప్రతిష్ఠాత్మక విజయాలను నమోదు చేస్తున్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు ప్రాంతంలో ఉన్న లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు తెలంగాణ స్టేట్ లెవెల్ అథ్లెటిక్స్ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచారు. గత నెల 26వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో గెలుపొంది, ఆగస్టు 7వ తేదీన వరంగల్ నగరంలోని జేఎన్ఎస్ స్టేడియం ప్రాంగణంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలలో జావెలెన్ త్రో క్రీడా విభాగంలో 10వ తరగతికి చెందిన పల్లవి, 8వ తరగతికి చెందిన మోక్ష, ఇంద్రావత్ బబ్లూ ప్రథమ స్థానాల్లో నిలిచి పసిడి పతకాలను సొంతం చేసుకున్నారు. వీరితో పాటు స్టాండింగ్ జంప్ విభాగంలో 8వ తరగతి విద్యార్థి మలోత్ విష్ణువర్ధన్ అత్య అత్యుత్తమ ప్రతిభతో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అభినందించేందుకు గురువారం పాఠశాల ఆవరణలో ప్రత్యేక వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేకే.జయరాజన్ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జయరాజన్, ప్రధానోపాధ్యాయులు జయకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, శివశంకర్, ఇతర ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## గద్దర్ ఆశయ సాధనే ఆయనకు నివాళి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం, సమానత్వం కోసం తన జీవితాంతం కృషి చేసిన ప్రజా యుద్ధనౌక, ప్రజాకవి గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని సామాజిక వేత్త డాక్టర్ జాడి రాజు పేర్కొన్నారు. గద్దర్ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో గురువారం నివాళి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు అధ్యక్షులు తాళ్లపల్లి రవి, షెడ్యూల్ కులాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మాడుగుల శ్రీనివాస్, తెలంగాణ కళావేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు నకిరేకంటి కిరణ్ కుమార్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బొప్పని నగేష్, మిర్యాలగూడ బీసీ జేఏసీ కో కన్వీనర్ దాసరాజు జయరాజు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల అభివృద్ధికి రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యాసంస్థల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ఎంతో ప్రాధాన్యమైనదని, దీనిని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల ప్రాంగణంలో గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 1.5లక్షల రూపాయల విలువ కలిగిన ఆడియో సిస్టమ్, బెంచీలను అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు మాశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా పాఠశాల యాజమాన్యానికి వస్తు సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపాటి నవీన్ కుమార్, 1టౌన్ ప్రెసిడెంట్ కోడిరెక్క ఇంద్ర కుమార్, 2టౌన్ ప్రెసిడెంట్ మొయిజ్, కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్, రోటరీ క్లబ్ పూర్వ గవర్నర్ అశోక్ కుమార్, సభ్యులు రాములు, వీరయ్య, జ్ఞానదయాల్, మార్కండేయ, సుదర్శన్, సూరిశెట్టి రఘురాం, సురేందర్, అంజయ్య, పాఠశాల కమిటీ ప్రెసిడెంట్ నల్లపాటి వెంకటేశ్వర్లు, సెక్రటరీ కాకర్ల నరేందర్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాతపూర్వక ఒప్పందం కుదుర్చుకోవాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** హమాలీలతో కాంట్రాక్టర్లు వెంటనే రాతపూర్వక ఒప్పందం కుదుర్చుకోవాలని ఐఎన్‌టియుసి అధ్యక్ష కార్యదర్శులు విజయ నాయక్, పాండు డిమాండ్ చేశారు. మిర్యాలగూడలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆవరణలో పనిచేస్తున్న కార్మికులకు కాంట్రాక్టర్ల వల్ల తీవ్ర నష్టం జరుగుతోందనే విషయాన్ని గుర్తించి, వారి వైఖరికి నిరసనగా స్థానిక ఎఫ్సిఐ ప్రధాన ద్వారం ముందు గురువారం హమాలీలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపట్టారు. గత ఏడాదిన్నర కాలంగా ఎలాంటి అగ్రిమెంట్ చేయకుండా కాంట్రాక్టర్లు పనులు చేయించుకుంటూ తమ సొంత ప్రయోజనాలు పొందుతున్నారని, కార్మికులకు చెల్లించాల్సిన న్యాయమైన వాటాలను ఎగ్గొడుతూ శ్రమదోపిడీకి పాల్పడుతు న్నారని తెలిపారు. హమాలీల సమస్యలను పరిష్కరించాలని, రక్షణ కల్పించాలని కోరుతూ రూపొందించిన వినతిపత్రాన్ని ఎఫ్సిఐ ఏఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం నాయకులు మేరావత్ విజయ నాయక్, బాలోజీ నాయక్, పాండు తదితరులు పాల్గొన్నారు.



## సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

**ప్రజాపక్షం/పాలకవీడు:** మండలంలోని నాగిరెడ్డిగూడెం విద్యుత్ లైన్ ఫీడర్ కింద గత నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి వ్యవసాయ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు గురువారం పాలకవీడు సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు ఫీడర్ లైన్ లూజుగా ఉండి విద్యుత్ లైన్ ట్రిప్ అయి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎఈ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను త్వరగా పరిష్కారం చేయించి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని ఎఈ రైతులకు హామీ ఇచ్చారు.





## ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారిని బి పూజ తెలిపారు. మండలంలోని వావిళ్ళపల్లి, ఆరెగూడెం, జనగాం, పుట్టపాక పలు పెస్టిసైడ్స్ ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వ ఉంచిన ఎరువులు, పురుగుమందుల, స్టాక్ రిజిస్టర్లు లైసెన్సులు, విక్రయాల రికార్డులు గడువు తేదీలు పరిశీలించారు. రైతులకు బిల్లును తప్పనిసరిగా ఇవ్వాలని నకిలీ లేదా గడువు ముగిసిన ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారం హెచ్చరించారు. రైతులు వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల నుంచి ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు.

## ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఇంజనీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు బంటు సందీప్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసిస్తూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కృషి చేస్తున్న లక్షలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానించేలా ఇటువంటి వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చామకూరి మహేందర్, మీసాల వెంకట్, పల్లేటి సృజన్, పడిదల క్యాండీ పాల్గొన్నారు.

## ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీ హిల్ కాలనీ 4వ వార్డుకు చెందిన హరికాంత్ నివాసంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఇంటి సామగ్రి పూర్తిగా దగ్ధమై,కుటుంబం నిరాశ్రయులైన విషయం తెలుసుకున్న విబిఎన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి నినన్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయంగా కొంత నగదు అందించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి చేయూతనందించడమే విబిఎన్ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని అన్నారు.

## పిఆర్‌టియూటిఎస్ సభ్యత్వ నమోదు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో గురువారం పిఆర్‌టియూ టిఎస్ మండల సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంపాల రాజు, గోడుగు బాలరాజు, మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు జంపాల రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పిఆర్‌టియూ ముందంజలో ఉంటుందన్నారు. జిల్లా పిఆర్‌టియూ అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూధన్, పిఆర్‌టియూ మాస పత్రిక రాష్ట్ర ఉప సంపాదకులు వెంకటయ్య, శ్రీనివాస, మల్లేష్, రవి, ఉమారాణి, రమేష్, కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యువత భాగస్వామ్యంతోనే దేశ అభివృద్ధి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** యువతను మై భారత్, నాషా ముక్త్ యువ వికసిత్ భారత్, రెడ్ క్రాస్, కార్యక్రమాలలో భాగస్వాములను చేయాలని ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు.గురువారం ఎం జి యు పరిధిలోని కళాశాలల ప్రిన్సిపాల్తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మై భారత్ ద్వారా యువతను సామాజిక కార్యక్రమాలలో భాగస్వాములను చేయాలని,నానాటికి ఉపద్రవంలా వ్యాపిస్తున్న డ్రగ్స్ మహమ్మారిపై అవగాహనాల ద్వారా సుశిక్షితులైన సైనికులను తయారు చేయాలని కోరారు.రెడ్ క్రాస్ వంటి కార్యక్రమాల ద్వారా సామాజిక వాస్తవాలను సేవా దృక్పథం అలవారచుకోవడం సాధ్యమని ఆ దిశగా యువతను ప్రోత్సహించే కార్యక్రమాలను కళాశాలల పరిధిలో నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ వై ప్రశాంతి,ఆచార్య శ్రీదేవి,డాక్టర్ అరుణప్రియ,వివిధ కళాశాలల ప్రిన్సిపాల్ లు ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆకస్మికంగా అస్వస్థతకు గురై వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన రేవనాల ఐలయ్య (46) ఆకస్మికంగా అస్వస్థతకు గురై మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. మృతుడి భార్య రేవనాల పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం సాయంత్రం సుమారు 4:30 గంటలకు ఆమె తన భర్త రేవనాల ఐలయ్య, కుమార్తె శివమణితో కలిసి దుబ్బాక రోడ్డులో ఉన్న తమ వ్యవసాయ పొలానికి వెళ్లి వ్యవసాయ పనులు పూర్తి చేసి సాయంత్రం 5:00 గంటలకు ఇంటికి తిరిగి వచ్చారు. అదే రోజు రాత్రి భోజనం చేసిన అనంతరం నిద్రకు సిద్ధమవుతున్న సమయంలో రేవనాల ఐలయ్య ఒక్కసారిగా నేలపై పడిపోయి, నోటి నుండి నురుగు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే రామన్నపేట ఏరియా ఆసుపత్రికి రాత్రి 10:30 గంటలకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు చికిత్స అందించినప్పటికీ రాత్రి 11:00 గంటలకు ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు రామన్నపేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేట్టారు.

# మైనారిటీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మైనారిటీల విద్యా, ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రకటించిన అన్ని సంక్షేమ పథకాలను తక్షణమే అమలు చేయాలని జమియత్ ఉలేమా రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షా సయ్యద్ ఎహసనుద్దీన్ సాహిబ్ రషాదీ అన్నారు.గురువారం నల్లగొండలోని మీర్‌బాగ్ కాలనీ దారుల్ ఉలూమ్ మసీద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.2023లో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిక్లరేషన్ లో చేసిన అన్ని హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, మైనారిటీల సంక్షేమం కోసం వార్షిక రూ.4,000 కోట్ల బడ్జెట్ ను పూర్తిగా కేటాయించి, పారదర్శకంగా ఖర్చు చేయాలని కోరారు.ఇమామ్‌లు,మోజమ్‌లకు గౌరవ వేతనాలు పెంచాలని,వక్ఫ్ ఆస్తుల రక్షణ, ఆక్రమణల తొలగింపు, సమగ్ర సర్వే, డిజిటల్ రికార్డుల తయారీ అభివృద్ధి కార్యక్రమాలను తక్షణమే అమలు చేయాలన్నారు.మైనారిటీ విద్యార్థుల పెండింగ్ స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అన్నింటినీ విడుదల చేయాలని, భవిష్యత్తులో సమయానికి చెల్లింపును నిర్ధారించాలని అన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని కార్పొరేషన్లు, బోర్డులు, అథారిటీలు, సలహా కమిటీలు ఇతర ప్రభుత్వ సంస్థల్లో మైనారిటీలకు వారి జనాభాకు అనుగుణంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు.ఈ సమావేశంలో జమియత్ ఉలేమా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మౌలానా మగ్దుమ్,జిల్లా జనరల్ సెక్రటరీ మౌలానా అక్బర్ ఖాన్,జిల్లా కార్యదర్శి హఫీజ్ ఫుర్కాన్,ముఫ్తీ రజాక్, మౌలానా జుబేర్,మౌలానా హసన్,మౌలానా సమీ,ఉమర్,హఫీజ్, ముఫ్తీ సాహిబ్, హఫీజ్ హబీబ్, మౌలానా పీరానా,ఫైజల్,గౌస్, హఫీజ్ షంసుద్దీన్, కలీం,మౌలానా అతూర్,రహీం,మౌలానా పరాగ్, మౌలానా జానీ, సిద్దిక్ బాబా పాల్గొన్నారు.

## తుర్కపల్లి ఎస్సైని కలిసిన సర్పంచ్

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి పోలీస్ స్టేషన్ లో నూతన బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శివ కృష్ణను దత్తాయిపల్లి గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తుర్కపల్లి మండలానికి నూతనంగా విచ్చేసిన సందర్భంగా పరిచయం చేసుకుని, పర్యావరణ పరిరక్షణ సందేశంతో మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా తుర్కపల్లి పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. దత్తాయిపల్లి ఉప సర్పంచ్ జిట్ట బాలకృష్ణ,వార్డు సభ్యులు పాల హరీష్, నల్ల రాజు, నవీన్ పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు బాసట

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన మేడే హన్మంత్, మరిపడిగ గ్రామానికి చెందిన శ్యామల శ్రీనివాస్, వస్తాకొండూరు గ్రామానికి చెందిన చాంద్‌పాషాలు ఇటీవల పలు కారణాలతో మరణించడం జరిగింది. మానవ సేవే మాధవ సేవా అనే కార్యక్రమంతో ఆపదలో ఉన్న వారికి సహాయం చేస్తున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషణ్ చైర్మన్ మబ్బు మహేష్ గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. 5016లను ఆర్థిక సహాయంగా అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు గూడెపు కుమార్, లింగాల అనిల్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## 9న డిండి మండలంలో సిపిఐ ప్రచార యాత్ర

**ప్రజాపక్షం/డిండి;** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 16 నుండి 14 వరకు జరిగే ప్రచార యాత్రలో భాగంగా ఈనెల 9న డిండి మండలంలో ప్రారంభమై 12వ తేది వరకు దేవరకొండ నియోజకవర్గంలో సిపిఐ ప్రచార యాత్ర కొనసాగుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి గురువారం తెలిపారు. 9న ఉదయం డిండి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై ప్రచార యాత్రను ప్రారంభిస్తారని అనంతరం కందుకూరు, బ్రహ్మణపల్లి, రామంతాపూర్, సింగరాజుపల్లి, తవక్లాపూర్, శేషాయికుంట, చెరుకుపల్లి, ఎర్రారం, కే. గౌరారం, గోనబోయినపల్లి, బొగ్గులదోన, జేత్యతండా, గోనకోల్, డిండిలో ప్రచార యాత్ర సాగుతుందని ఈ యాత్ర విజయవంతానికి మండల కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సభ్యులు, గ్రామశాఖల కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరై ప్రచార యాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

## తాజ్‌పూర్ గ్రామాన్ని సందర్శన



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో యాదాద్రి భువనగిరి జిల్లా డీపీవో శ్రీనివాస్ రెడ్డి, డీఎల్ పీవో శ్రీకాంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులు, గ్రామాన్ని సందర్శించడం జరిగింది. అందులో భాగంగా గౌరవ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ వారిని శాలువా తో సత్కరించి ఆహ్వానించారు. ఈ సందర్బంగా వారు గ్రామంలోని డంపింగ్ యార్డు ను సందర్శించి నాలుగు రకాల చెత్త సేకరణ ను, అక్కడ వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల పెంపకాన్ని, సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని గౌరవ సర్పంచ్ ని అడిగి తెలుసుకున్నారు. తదుపరి గౌరవ సర్పంచ్ స్వంత ఖర్చులతో పునరుద్దరణ చేయబడిన గ్రామ ఎంపియుపి పాఠశాలను సందర్శించి సంతోషం వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త డా.ర్యాకల శ్రీనివాస్, పంచాయతి కార్యదర్శి నర్సింగ్ రావు, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, మహ్మద్ గాలిబ్ యాకుబ్, బొమ్మారపు రామక్రిష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజు, బీట్కూరి మహేష్, వరిగంటి మానస నాగరాజు, షేక్ అహ్మద్, FA రామస్వామి, ఆశ కార్యకర్త కారోబార్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసేందుకు కుట్ర

**ప్రజాపక్షం/దేవరకొండ;** రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న పీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ నిధులను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని బిఆర్‌ఎస్‌వి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో నిర్వహించిన బిఆర్‌ఎస్‌వి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ నిధులు విడుదలలో జాప్యం వల్ల వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసమావేశంలో బిఆర్‌ఎస్‌వి నాయకులు ఆంజనేయులు, రాజేష్, అనిల్, వెంకటేష్, శ్రీను, రాజు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి చేయూత

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన ఉంద్రాతి వెంకన్న నాలుగు రోజుల క్రితం పాముకాటుకుగురై మృతి చెందడంతో కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మన ఆపద్బాంధవుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి 50 కేజీల బియ్యం, 14 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బాదే చంద్రశేఖర్,వేముల సైదులు, ఈదులకంటి శివకుమార్, ఉంద్రాతి నరసింహ, మిత్రులు కానుకుంట్ల ఉపేందర్,గౌస్, వనం నరేష్, మోహన్,ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



## జయశంకర్ సార్‌కు ఘన నివాళులు

**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త తెలంగాణ ఉద్యమ మేధావి, తెలంగాణ రూపకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను గురువారం కోదాడ ప్రాంతీయ వైద్యశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరి అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సిరిపురపు సురేంద్ర పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/రామన్నపేట :** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి కార్యక్రమం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.లక్ష్మి నీలిమ,ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి సందర్భంగా పట్టణంలోని రెడ్డి కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు, తిప్పన విజయసింహారెడ్డి ఆచార్య జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో చింత రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దుర్గంపూడి నారాయణరెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, జొన్నలగడ్డ రంగారెడ్డి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్ జయంతి వేడుకలను గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ విద్యాసంస్థలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నేతృత్వంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కె.బాబు, కరీముల్లా, భాగ్యమ్మ, అబ్బ, ఉపేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/డిండి;** ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకొని గురువారం డిండి మండల పరిషత్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేజన జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



# ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని ప్రభుత్వ విప్ వీరేశంకు వినతి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** శంషాబాద్ నుండి చెన్నై బుల్లెట్ ట్రైన్ మొదటి అలైన్మెంట్‌ను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ జాతీయ రహదారి 65 సమాంతర బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు బుల్లెట్ ట్రైన్ మొదటి అలైన్మెంట్ కొనసాగించడం వల్ల నల్లగొండ,సూర్యపేట జిల్లాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం లభించడంతోపాటు ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి పార్లమెంటు సభ్యుల దృష్టికి తీసుకెళ్లి మొదట ప్రకటించిన అలైన్మెంట్ ను యథావిధిగా కొనసాగించేలా చూడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్ ట్రైన్ సాధన కమిటీ నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ శంభు లింగారెడ్డి, కో కన్వీనర్లు అక్కనపల్లి వీరస్వామి, రేపాల సతీష్, వివిధ పార్టీల ప్రతినిధులు అంబటి చిరంజీవి, గజ్జి రవి, వంటేపాక వెంకటేశ్వర్లు,లింగాల వెంకన్న,పన్నల రాఘవరెడ్డి,యాతాకుల అంజయ్య, పాల్గొన్నారు.

# వేములపల్లిలో స్టోరేజ్ గోదాం పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/వేములపల్లి:** శాసనసభ సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డిమండల కేంద్రంలో స్టోరేజ్ గోదాం నిర్మాణ పనులకు గురువారం శాసనసభ సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు విత్తనాలు,ఎరువులను సురక్షితంగా నిల్వ చేసుకోవడానికి ఈ గోదాము నిర్మిస్తున్నాం.గతంలో రైతులు సరైన నిల్వ సదుపాయాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది.ఈ గోదాం ద్వారా రైతులకు సమయానికి విత్తనాలు,ఎరువులు అందుబాటులో ఉంటాయి అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి అనేక చర్యలు తీసుకుంటోందన్నారు."రాబోయే రోజుల్లో మండలంలో వ్యవసాయ అనుబంధ రంగాలను మరింత అభివృద్ధి చేస్తాం. ప్రతి గ్రామంలో రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తాం అని హామీ ఇచ్చారు. తహశీల్దార్ పుష్పలత,ఎంపీడీవో జితేందర్,వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్,ఆర్ఐ స్పందన, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్,ఏఈ మున్నీషా బేగం, సర్పంచ్ సందీప్ కుమార్,కాంగ్రెస్ పార్టీ నాయకులు దైదగిరి పుట్టల పెద్ద వెంకటయ్య పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న కోళ్ల ఫారాలను ఆపేయాలి

### దామెర భీమనపల్లిలో అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం



**పజాపక్షం/మర్రిగూడ:** మండలం దామెర భీమనపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా ఏదో జరుగుతోంది. పొలాల మధ్య పెద్ద పెద్ద షెడ్లు పుట్టుకొస్తున్నాయి. గ్రామస్తులు మొదట్లో పట్టించుకోలేదు.కానీ రోజులు గడిచేకొద్దీ అక్కడ కోళ్ల ఫారాలు నిర్మిస్తున్నారని తెలిసింది.అనుమతులు ఉన్నాయా?అని అడిగితే సమాధానం లేదు. గ్రామపంచాయతీ కూడా మేము ఎలాంటి నిర్మాణ అనుమతులు ఇవ్వలేదు అని ఆర్టిఐ ద్వారా స్పష్టం చేసింది.కేవలం ఎన్ఓసి మాత్రమే ఇచ్చామని చెప్పింది.అయినా పనులు ఆగలేదు. ఇప్పటికే ఒక ఫారం పూర్తయ్యింది. ఇప్పుడు మరిన్ని షెడ్లు,గోదాములు, కార్మికుల గదులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రతిరోజు 40 నుంచి 50 మంది కార్మికులు పని చేస్తున్నారు.గ్రామస్తులు భయపడ్డారు. దుర్వాసన వస్తుంది,ఈగలు దోమలు పెరుగుతాయి,పిల్లలు,ముసలివాళ్లు అనారోగ్యం పాలవుతారు అని జిల్లా కలెక్టర్ దగ్గర నుంచి మండల అధికారుల వరకు ఫిర్యాదులు చేశారు. నెల రోజులు గడిచింది. కానీ ఒక్క అధికారి కూడా వచ్చి తనిఖీ చేయలేదు..నిర్మాణాలు మరింత వేగంగా జరుగుతున్నాయి. అధికారులు ఎందుకు మాట్లాడటం లేదు ఎవరి ఒత్తిడి ఉంది అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పుడు గ్రామమంతా ఒకటే డిమాండ్. అనుమతులు లేని అక్రమ కోళ్ల ఫారాలను వెంటనే ఆపేయాలి. మా ఆరోగ్యాన్ని కాపాడాలి. జిల్లా యంత్రాంగం ఈ సున్నితమైన అంశంపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## చదువే కాదు... నాయకత్వం కూడా అవసరం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** విద్యార్థులు చదువుతోపాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని నకరేకల్ సిఐ హరిబాబు సూచించారు గురువారం పట్టణంలోని నారాయణ పాఠశాలలో క్యాబినెట్ ఇన్స్టాలేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.పాఠశాల స్థాయి నుంచే బాధ్యతలు తీసుకోవడం, ఇతరులకు సహాయం చేయడం వంటి గుణాలు అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదుగుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై గడగోజు కృష్ణమాచారి,డీజీఎం వెంకటరమణారెడ్డి, ఏజీఎం శ్రీనివాస్ రెడ్డి,ప్రిన్సిపాల్ నరేష్,ఏడి శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్స్ హసీనా,ఉమా,కోఆర్డినేటర్స్ రవిశంకర్,సునీత,హర్ష,ఏవో క్రాంతి, పీఈటి రజనీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## స్నేహితుడి కుటుంబానికి చేయూత

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణానికి చెందిన ప్రముఖ పురోహితుడు పగిడిమర్రి మధుసూదన్ శర్మ ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందడంతో వారి కుటుంబానికి చిన్ననాటి మిత్రులు అండగా నిలిచి తమ స్నేహబంధాన్ని చాటుకున్నారు. నకిరేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986/87 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గురువారం మధుసూదన్ శర్మ నివాసానికి వెళ్లిన స్నేహితులు,వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా తమవంతు ఆర్థిక సాయంగా రూ. 50,116 ల నగదును కుటుంబ సభ్యులకు అందజేసి భవిష్యత్తులోనూ అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులు దండ అశోక్ రెడ్డి, సుదిని శ్రీనివాస్ రెడ్డి, రావిరాల అశోక్, లింగాల వెంకన్న, అలవాల సుదర్శన్, తోట ఆదిత్య, ఇట్టమల్ల అమృత రావు, బ్రహ్మదేవర రవిశంకర్, యాతాకుల కిరణ్, సాకుంట్ల నరసింహ, మిరియాల రమేష్, కస్తూరి రవికుమార్ పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన ఉర్దూ ఉపాధ్యాయులు



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉర్దూ మీడియం ప్రభుత్వ ఉపాధ్యాయుడు మహమ్మద్ అఫ్జల్ కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తూ టిఎస్పిటిఎ ఉర్దూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల నుంచి సేకరించిన రూ.67వేలు నగదు విరాళాన్ని జమియత్ ఉలేమాఏహింద్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ఎహ్సానుద్దీన్ ఖాస్మీ చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా మౌలానా ఎహ్సానుద్దీన్ ఖాస్మీ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక,మానవీయ బాధ్యత. కష్టకాలంలో ఒకరికి ఒకరు అండగా నిలవడం ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలోపేతం అవుతాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా అక్బర్,టిఎస్‌పిటిఎ జిల్లా అధ్యక్షులు ఎం.ఏ.గఫూర్,ప్రధాన కార్యదర్శి ఎండి షాహీన్ తయ్యబ్,ఉర్దూ ఉపాధ్యాయులు హుసాముద్దీన్,బియాబాని, అయూబ్ ఖాన్,బషారత్ అలీ బఖర్, జలాల్ పాల్గొన్నారు.

## అంతంపేట ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసుపై తల్లిదండ్రుల ఆగ్రహం

**ప్రజాపక్షం/చండూరు/ఘట్టుప్పల్ :** మండల పరిధిలోని అంతంపేట ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు శేఖర్‌కు మండల విద్యాధికారి (ఎంఈఓ) జారీ చేసిన షోకాజ్ నోటీసు స్థానికంగా వివాదానికి దారితీసింది.ఈ చర్య కక్షపూరితంగా ఉందంటూ గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎంఈఓ శేఖర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసి ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించగా,దీనిపై అంతంపేట గ్రామంలో తల్లిదండ్రులు సమావేశమై తమ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేఖర్‌ను ఉద్దేశపూర్వకంగానే విద్యార్థులు లేని శేరిగూడెం పాఠశాలకు బదిలీ చేశారని ఆరోపించారు.అంతంపేట పాఠశాలలో ప్రస్తుతం సుమారు 100 మంది విద్యార్థులు చదువుతున్నారని,గత కొన్నేళ్లుగా శేఖర్ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల చేరికల పెంపు కోసం కృషి చేశారని కొనియాడారు.అలాంటి ఉపాధ్యాయుడిపై దిన పత్రికలో ఫొటో ప్రచురితమైందనే కారణంతో షోకాజ్ నోటీసు జారీ చేయడం సమంజసం కాదని విమర్శించారు.శేఖర్‌ను తిరిగి అంతంపేట పాఠశాలలోనే కొనసాగిస్తూ, షోకాజ్ నోటీసును వెంటనే రద్దు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకోవాలని తల్లిదండ్రులు కోరారు.అధికారులు సానుకూలంగా స్పందించకపోతే మండల కేంద్రంలో ధర్నా నిర్వహించి, ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో తల్లిదండ్రులు ఎం. నరేందర్,వి.అశోక్,ఎం.ఆనంద్, ఎ.నరసింహ, వి.రాధా,ఎం. యాదయ్య, బిక్షపతి, బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

# సార్ ఆశయాల సాధనకు పునరంకితమవుదాం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పరిశ్రమించిన ఆచార్య జయశంకర్ సార్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆచార్య జయశంకర్ సార్ 92వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ కేంద్రంలోని ఆచార్య జయశంకర్ సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, విశ్వకర్మ సంఘం బాధ్యతులతో కలిసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



**ప్రజాపక్షం/అర్వపల్లి/:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సారు జయంతి సందర్భంగా గురువారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.





**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్త పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ప్రజాపక్షం/మర్రిగూడ:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దామెర భీమన పెల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు.

**ప్రజాపక్షం/హాలియా:** ప్రొఫసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను హాలియా మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. జయశంకర్ జయంతిని పురస్కరించుకొని హాల్యా మున్సిపాలిటీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, కౌన్సిలర్లు ప్రసాద్ నాయక్,చెరుపల్లి ముత్యాలు పాల్గొన్నారు.






**ప్రజాపక్షం/తుంగతుర్తి :** బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య జయశంకర్ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుండగాని రాములు గౌడ్, గోపగాని రమేష్, తడకమళ్ల రవికుమార్, తప్పెట్ల ఎల్లయ్య, చింతకుంట్ల మనోజ్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని గాజులమల్కాపురం గ్రామ పంచాయితీ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆచార్య జయశంకర్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి, వైస్ చైర్మన్ షఫీఉల్లా, కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని వల్లాపురం గ్రామంలో సర్పంచ్ కేసగాని సరిత లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ కోట చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

**ప్రజాపక్షం/నడిగూడెం:** ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని నడిగూడెం సర్పంచ్ దున్న శ్రీనివాస్ అన్నారు. ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత సౌకర్యాలను, మౌళిక వసతులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గురువారం కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేసిన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్

















విజయనాయక్, అధ్యాపకులు శ్రీధర్, కృష్ణ, మహేష్, ఉపేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మేళ్లచెరువు/భువనగిరి/అడ్డగూడూరు/నకిరేకల్/నడిగూడెం/హుజూర్‌నగర్/యాదాద్రి కలెక్టరేట్ :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ స్వీయ అస్తిత్వం కోసం, ప్రజాస్వామ్య పరివర్తన కోసం కన్నీళ్లు, రక్తం కలగలిసిన అసంఖ్యాక బలిదానాలను చేసిందని.ఈ క్రమంలోనే తన స్వీయ జీవితాన్ని ఉద్యమానికి అంకితం చేసి,మూడు తరాల ఉద్యమానికి వంతెనగా మారి తెలంగాణ లక్ష్యాన్ని తీరం చేర్చిన వైతాళికుడు ఆచార్య జయశంకర్ అని ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేపల్లి ఆదిరెడ్డి,జిల్లా అధ్యక్షులు కట్టా అనంతరెడ్డి అన్నారు.ఆచార్య జయశంకర్ 92వ జయంతి సందర్భంగా బార్ హాల్లో ఐఏఎల్ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.



## సబ్సిడీపై కంది విత్తనాలు

**ప్రజాపక్షం/చింతలపాలెం :** ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆరుతడి పంటలను సాగు చేసేందుకు ప్రోత్సహించే భాగంలో ఉచితంగా కంది విత్తనాలను సరఫరా చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి శశాంక్ ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ వ్యవధిలో 130 135 రోజుల్లో కరువును తట్టుకునే కందులు పిఆర్‌జి 176 విత్తనం 100 బ్యాగ్‌లు (ప్రతి బ్యాగ్ 4 కిలోలు) రైతువేదికలో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. రైతులు తమ పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకొని రావాలన్నారు. 4 కిలోల విత్తనాల ధర రూ.520 ఉండగా ప్రభుత్వం రూ.400లకే అందిస్తుందని చెప్పారు.

## ఇసుక డంప్ సీజ్

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** కాలపరిమితి ముగిసిన 140 టిప్పర్ల భారీ ఇసుక డంప్‌ను మైనింగ్ జిల్లా అధికారితో కలిసి తహశీల్దార్ శ్రీకాంత్ గురువారం సీజ్ చేశారు. ఇసుక స్టాక్ యార్డును తనిఖీ చేయగా అనుమతులు గత నెల 28తో ముగిసినట్లు తేలడంతో సీజ్ చేయడం జరిగింది. ఇసుక డంప్ పర్యవేక్షణ బాధ్యతను పంచాయితీ కార్యదర్శి అశోక్‌కు అప్పగించారు. జిల్లా మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ రఘుబాబు, సూపరింటిండెంట్ విజయరామరాజు, టిఎస్ఎండిసి ప్రాజెక్ట్ అధికారి కిరణ్ కుమార్, జిపిఓ అజయ్ పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలలో గోడ దూకిన వ్యక్తిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/మోతె :** మండల కేంద్రంలోని కస్తూరిభా పాఠశాలలో గోడ దూకి ప్రవేశించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి 3 గంటల సమయంలో పాఠశాలలోకి మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన చాట్ల వంశీ (20) అను వ్యక్తి ప్రహరీగోడ దూకి పాఠశాలలో చొరబడ్డాడు. పాఠశాలలో ఉన్న బాలికలు ఒక్కసారిగా ఉలికిపడి అప్రమత్తం కావడం, వాచ్‌మెన్ ఇందిరమ్మ, మరొక ఉపాధ్యాయుడు లేచి ఆగంతకున్ని వేటాండడంతో తిరిగి గోడదూకి పరారయ్యాడు. పాఠశాల ప్రత్యేకాధికారి క్రాంతి కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

## 40 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ప్రకటించాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తూ 40 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పిఆర్‌సిని ప్రకటించాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ఉమర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వివిధ పాఠశాలల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పిఆర్‌సిని ప్రకటిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత దాని ఊసు ఎత్తకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొల్లెదు నరేందర్, గుంటపంగు వెంకటేశ్వర్లు, నాయకులు గణిత, ఆనంద భాస్కర్, వెంకటయ్య పాల్గొన్నారు.

